సంగారెడ్డి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో వేద సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కర్ర సాము ట్రైనింగ్ క్యాంపు నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపకులు రమేశ్ మాస్టర్ నేతృత్వంలో మొదటిసారిగా కర్ర సాము నిర్వహించడం విశేషం. మన పూర్వీకులు నేర్చుకున్నటువంటి కర్రసాము విద్యను అందరికి అందించాలన్న ఉద్దేశ్యంతో అకాడమీని ఏర్పాటు చేసినట్టు మాస్టర్ రమేశ్ తెలిపారు. కర్ర సాము ట్రైనింగ్ క్యాంపులో సుమారు 60 మంది విద్యార్థులు హాజరై వివిధ విభాగాలలో చతురస్రం కర్ర ఫైట్ విభాగాల్లో తర్ఫీదు పొందారు. అనంతరం హైదరాబాద్ నుంచి విచ్చేసిన కర్రసాము ఫెడరేషన్ ఇండియా తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ వినోద్ మాస్టర్ హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అశోక్, వినయ్‌కుమార్, కళ్యాణ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అత్తే హతమార్చింది

వీడిన యువకుడి హత్యకేసు మిస్టరీ



విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల క్రితం హత్యకు గురైన యువకుడి కేసు మిస్టరీ వీడింది. మృతుడి అత్తే ప్రధాన నిందితురాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన దొంతి మహేష్(32)కు పదేళ్ల క్రితం ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన లావణ్యతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. మహేష్ మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా భార్యను కొట్టేవాడు. ఆ హింస భరించలేక భార్య పలుమార్లు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లినా.. అక్కడికి వెళ్లి భార్య, అత్తతో గొడవపడి వారిని కొట్టేవాడు. మహేష్ తండ్రి మృతిచెందగా వచ్చిన రైతుబీమా డబ్బులు జల్సాలకు ఖర్చుచేశాడు. దీంతో పాటు ఉన్న రెండెకరాల భూమిని అమ్మకానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. కూతురును చిత్రహింసలకు గురిచేయడం, పిల్లలను సరిగ్గా చూడకపోవడం, భూమిని అమ్మేస్తే పిల్లలకు ఆసరా ఉండదని భావించిన అత్త వీరమణి ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నది. పదిరోజుల క్రితం మహేష్ భార్యతో గొడవపడి చిన్న కూతురును వేడి నీళ్లల్లో పడేశాడు. చిన్నారికి గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఖేడ్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. గత నెల 30న మహేష్ ఆస్పత్రికి రాగా.. అక్కడే ఉన్న అత్త పథకం ప్రకారం.. ఖేడ్ మండలం నర్సాపూర్‌కు చెందిన కిష్టయ్యను పిలిపించింది. కిష్టయ్య, మహేష్, వీరమణి ముగ్గురూ కలిసి అంత్వార్ మార్గంలోని జూక్కల్ శివారులో ఖాళీ స్థలానికి వెళ్లారు. అక్కడ మహేష్‌కు ఫుల్‌గా మద్యం తాగించారు. ఇదే అదునుగా భావించిన అత్త వీరమణి, కిష్టయ్య ప్లాస్టిక్ తాడుతో మహేష్ గొంతుకు బిగించి ఊపిరాడకుండా చేశారు. అయినా ప్రాణం పోలేదని నిర్ధారించుకుని రోడ్డుపైకి లాక్కొచ్చారు. అక్కడ అత్త రాయితో మహేష్ ముఖంపై గట్టిగా కొట్టి హత్యచేసిందని పోలీసులు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా.. వీరమణి, కిష్టయ్య నిజం ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ, ఎస్‌ఐ వెల్లడించారు.

కదిలిస్తే కన్నీళ్లే..

- ఒకే కుటుంబంలో నలుగురి మృతితో పోతారంలో విషాద ఛాయలు
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు
- పూర్తయిన అంత్యక్రియలు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

"నాన్న.. లే నాన్న.. అంటూ తండ్రి మృతదేహంపై పడి అతడి ఒక్కగానొక్క కూతురు గుండెలవిసెలా ఏడ్వడం.. మీ అమ్మ వెళ్లిపోతున్నది బిడ్డా.. నీకు అమ్మ అనే పిలుపు దూరమవుతున్నది, మీ అక్క పిలుస్తున్నది లేవుంద్రి బిడ్డ అంటూ భార్యాబిడ్డల మృతదేహాల వద్ద తండ్రి తన పెద్ద బిడ్డను పట్టుకుని రోధించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. "

మనోహరాబాద్, నవంబరు (ఆంధజ్యోతి)3: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. శనివారం మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో బైకును ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో అక్కడికక్కడే నలుగురు మృతి చెందిన విషయం తేలిసిందే. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు ఆంజనేయులు కూతురు భానుప్రియ నాన్న లే నాన్న అంటూ ఏడుస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. మృతురాలు మన్నె లావణ్య భర్త కూమార్ పెద్ద కూతురు సంజనను పట్టుకుని పెద్దగా ఏడ్వడం ప్రతి ఒక్కరినీ కదిలించింది. 'లే లావణ్య.. మీ అక్క పిలుస్తుంది రండి అమ్మా అంటూ భార్య, కూతుర్లను కూమర్ పిలుస్తున్న తీరు చూపరులను కంటితడి పెట్టించింది. కాగా, బాధిత కుటుంబ సభ్యులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబలకు అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు తెలిపారు.

ఇంట్లో చోరీ

● రూ.15 లక్షల విలువ చేసే బంగారం అపహరణ

పటాన్‌చెరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బానూర్ లైఫ్ స్టైల్ డ్రీమ్ హోమ్స్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. బీడీఎల్ పోలీసులు అందించిన సమాచారం ప్రకారం భాను లైఫ్ స్టైల్ డ్రీమ్ హోమ్స్‌లో ఉంటున్న శరత్, సుప్రియ దంపతులు మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి సెకండ్ షో సినిమాకి వెళ్లి ఇంటికి వచ్చే చూడగా మెయిన్ గేటు తాళం పగలగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.15 లక్షల విలువ చేసే బంగారం, 5 వేల నగదు దొంగలు కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాష్‌పల్లి శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ సీఐ రంగకృష్ణ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ. 1,07,500 నగదు, 8 సెల్‌ఫోన్‌లు, 3 కార్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బస్టాండ్‌లో యువకుడి హత్య

- ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన గుర్తు తెలియని దుండగులు
- మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో ఘటన
- పదిరోజుల వ్యవధిలో రెండు హత్యలు

చిన్నశంకరంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అనంత పద్మనాభగుట్ట వద్ద బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం స్థానికులు బస్టాండ్ వద్ద కాలిపోయిన మృతదేహాన్ని చూసి, భయంతో పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్‌ఐ నారాయణగౌడ్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకట్రామ్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. క్లూస్‌టీం, జాగిలాలను రప్పించి ఆధారాలను సేకరించారు. బస్టాండ్ పరిసరాలను, రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. గతనెల 24 చిన్నశంకరంపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా హత్యచేసి ఒంటిపై నిప్పంటించిన ఘటన మరువక ముందే.. మరో హత్య వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఎస్పీ మాట్లాడుతూ దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ కోసం చిన్నశంకరంపేట పోలీసులను సంప్రదించాలన్నారు.

వరుస హత్యలతో భయం.. భయం..

వరుస హత్యలతో చిన్నశంకరంపేట ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే రెండు దారుణ హత్యలు చోటు చేసుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. గత నెల 24న ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తిని దుండగులు హత్య చేసి నిప్పంటించారు. ఇది మరవకముందే మరో ఘటన చేసుకోవడం కలకలం రేపుతున్నది. మండల కేంద్రంలోని పరిశ్రమల్లో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వస్తుంటారు. మృతులు స్థానికులే అయిఉంటే హత్యకు గురైన వివరాలు తెలిసి ఉండేవని, స్థానికేతరులు కాబట్టే తెలియడంలేదని స్థానికులు అంటున్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



ఘటనా స్థలంలో జాగిలంతో తనిఖీ..



సదర్ ఉత్సవాలలో పాల్గొన్న నీలం మధు

యాదవుల సంస్కృతికి ప్రతీక సదర్

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధు

పటాన్‌చెరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదవుల సంస్కృతికి సదర్ ఉత్సవాలు ప్రతీక అని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. ఆదివారం పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సావాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా నీలం మధు మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యత, జంతువులపై వారికున్న ప్రేమను చాటుతున్నాయన్నారు. సదర్ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక పండగగా గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న నీలం మధు, కార్పొరేటర్ పుష్పనగేష్‌యాదవ్, నాయకులు నరసింహారెడ్డి, దేవరాజ్, కృష్ణయాదవ్, మధు, శ్రీనివాస్, వెంకటేశం తదితరులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

తేనెటీగల దాడిలో గొర్రెల కాపరి మృతి



బాలయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోకర్ల బాలయ్య(45) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో జీవాల మేత కోసం గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు కొమ్మలు తెంపుతుండగా అకస్మాత్తుగా ఆ చెట్టుకు ఉన్న తేనటీగల గుంపు బాలయ్యను చుట్టుముట్టాయి. దీంతో బాలయ్య గ్రామంలోకి పరుగు పెట్టి ఒక ఇంటిలోకి దూరినప్పటి కీ వదిలిపెట్టకుండా కరిచాయి. ఇది గమనించి గ్రామస్థులు గడ్డితో మంటలు పొగ పెట్టి తేనటీగలు తరిమికొట్టారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన బాలయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వంటిమామిడిలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

అందమైన రాత.. ముత్యాల పోత

- వృత్తి వ్యవసాయ అధికారి.. ప్రవృత్తి 'కాలిగ్రఫీ' ఆర్టిస్ట్
- చేతి రాతతో కళకు జీవం పోస్తున్న ఏఈవో వంశీకృష్ణ
- కాలిగ్రఫీతో మంత్రముగ్ధులను చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి





సంగారెడ్డి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : మనిషి కదిలితే ఒక కళ.. మనసు కదిలితే ఒక కళ.. ప్రకృతి ప్రసాదించిన 64 కళల్లో ఒక్కొక్కరిది ఒక కళ. అందులో అందమైన చేతిరాత ఓ కళనే. అక్షరాలు పొందికగా రాయాలంటే ఎంతో ఓర్పు, నేర్పు ఉండాలి. జన్మత ఉన్న అభిరుచికి అభ్యాసం తోడైతే అద్భుతంగా రాణిస్తారు. ముత్యాల పోతలా చూడచక్కని అందమైన చేతిరాతతో అందరిని మెప్పిస్తున్నారు ఓ ప్రభుత్వ ఉద్యోగి. గురువుల ప్రోత్సాహం తనలోని ఉత్సాహం కాలిగ్రఫీ ఆర్టిస్ట్‌గా మార్చిందంటున్నారు సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల వ్యవసాయ విస్తరణాధికారి వంశీకృష్ణ.

కాలిగ్రఫీతో కట్టిపడేస్తూ

నిజాంపేట మండల వ్యవసాయ విస్తరణ అధికారిగా(ఏఈవో) పనిచేస్తున్న వంశీకృష్ణది మెదక్ జిల్లా పెద్దశంకరంపేట. చేతి రాతతో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించాలన్నదే ఆయన తపన. ఏఈవోగా వృత్తిని కొనసాగిస్తూనే ప్రవృత్తిగా కాలిగ్రఫీ ఆర్టిస్ట్‌గా మారాడు. తన చేతి రాతతో మంత్రముగ్ధులను చేస్తున్నాడు. హైదరాబాద్‌లో ఏడాదిన్నర కాలం పాటు వంశీకృష్ణ కాలిగ్రఫీ ఆర్టిస్ట్‌గా శిక్షణ తీసుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో పెన్ ఎక్స్‌పోజ్ కార్యక్రమంలో పాల్గొని అందరి మన్ననలు పొందారు.



ఏదో ఆశించి కాదు.. ఇష్టంతో నేర్చుకున్నా : వంశీకృష్ణ

అందమైన చేతి రాత రాస్తే ఆ రాత చూసిన వారు... రాసిన వ్యక్తి ఆ ప్రాంతంలో లేకపోయినా ఆ రాత ఎవరు రాశారని, స్క్రిప్ట్ చూసిన వారి నుంచి పొగడ్తలు వస్తుంటాయి. ఆ గొప్పదనం చేతి రాతకు ఉంటుంది. చేతి రాత అనేది ఒక సైన్స్. గీత తలరాతను మారుస్తుంది అనే దానికి కాలిగ్రఫీ ఆర్ట్ ఒక నిదర్శనం. చిన్నప్పటి నుంచి రాయడంపై నాకు ఆసక్తి. కాలిగ్రఫీలో చాలా రకాలు ఉంటాయి. అందులో నేను నేర్చుకున్నది ఇంగ్లిష్‌లో కాపర్ ప్లేట్ కాలిగ్రఫీ. ఏదో ఆశించి కాకుండా ఇష్టంతో కాలిగ్రఫీ ఫీల్డ్‌లోకి వచ్చాను. భవిష్యత్తులో పలువురికి నేర్పిస్తాను. రాయడం వల్ల మనిషి ఒత్తిడి, ఇతర సమస్యలను దూరం చేస్తుంది. ఆబ్లిక్ హోల్డర్ పెన్‌తో అందంగా రాస్తున్నపుడు అన్ని మర్చిపోతారు. మెడిటేషన్ చేసినప్పుడు మైండ్ ఎంత ప్రశాంతంగా ఉంటుందో కాలిగ్రఫీ చేసినప్పుడూ అంతే ప్రశాంతంగా ఉంటుంది. అందమైన రాతపై ఆసక్తి ఉన్నవారు కాలిగ్రఫీ నేర్చుకోండి.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన మాణిక్యం

సంగారెడ్డి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ చైర్మన్‌గా ఎన్నికైన బీఆర్.నాయుడిను ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం హైదరాబాద్‌లోని బీఆర్.నాయుడు కార్యాలయంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడికి సన్మానం

సంగారెడ్డి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరిని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలో ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ సందర్భంగా టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత, రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ యాదగిరిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

6న రుద్రయాగం

నారాయణఖేడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత ఆలయం సమీపంలో 6న రుద్రయాగాన్ని లలితా వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మలమంచి మోహన్‌జ్యోషి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కరాటేలో విద్యార్థికి 'సిల్వర్'

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి కె.సుధాకర్ కరాటే పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న సుధాకర్ హిమాయత్ సాగర్‌లోని లార్డ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో వివిధ కళాశాలల మధ్య జరిగిన ఇంటర్ కాలేజియేట్ కరాటే కాంపిటేషన్స్‌లో తలపడి సిల్వర్ మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. విద్యార్థి సుధాకర్‌ను ప్రిన్సిపాల్ రత్నప్రసాద్‌తో పాటు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశ్విని అభినందించారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా చైర్మన్‌గా యుగంధర్

రామాయంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా చైర్మన్‌గా కోటి యుగంధర్ నియామకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ నుంచి మెదక్‌లో నియామకపత్రాన్ని అందుకున్నారు.

ఆలయాలకు విరాళం

శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడెంలో బీరప్ప ఆలయ నిర్మాణానికి స్లాబ్ కోసం రూ.51 వేలు, చండి చండి కాంబ ఆలయానికి రూ.10 వేలు, చండి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు రూ.15 వేలను మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా విరాళం అందజేశారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యాదయ్య, మహేష్, విజయ్, నందుతో పాటు తదితరులు బీఆర్ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే సునీతారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

'ధాన్యం కొనుగోలు తక్షణమే ప్రారంభించాలి'

వెల్దుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యంతో కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

వైద్య శిబిరం

పెద్దశంకరంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీ భగవాన్ సత్యసాయి సేవాసంస్థ సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం పెద్దశంకరంపేటలోని మాణిక్ ప్రభు మందిరంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

ఏఐటీయూసీలో కార్మికుల చేరిక

నారాయణఖేడ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నిజాంపేట గ్రామ పంచాయతీ కార్మికులు రవి, సాయిలు, దత్తు, వెంకట్‌రెడ్డి, దుర్గయ్య, శంకరమ్మ, మంజూల, నాగమణి, ఆదివారం ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి సమక్షంలో ఆ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా చిరంజీవి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు.

పేరుకే 100 పడకల ఆసుపత్రి..

సేవలు అంతంతే

- నర్సాపూర్‌లో అధునాతన ఆసుపత్రి భవనం
- రోజుకు దాదాపు 500 మంది ఔట్ పేషెంట్లు
- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్
- నేడు డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించనున్న మంత్రి దామోదర్‌రాజనర్సింహ





నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి, ఆవరణలోని ప్రత్యేక షెడ్డులో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంటు

నర్సాపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో అధునాతన భవనంలో వందపడకల ఆసుపత్రి ఉన్నా వైద్య సేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 4న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇదే ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించనుండటంతో.. ఇక ముందైనా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతాయని స్థానికులు ఆశగాఎదురు చూస్తున్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

నర్సాపూర్ పట్టణంలో గత ప్రభుత్వంలో మంజూరైన ప్రత్యేక అభివృద్ధి నిధులు సుమారు రూ.40 కోట్ల వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిలిచిపోవడంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ అసంపూర్తి దశలో నిలిచిపోయాయి దీంతో జిల్లా మంత్రి కూడా అయిన దామోదర్ రాజనర్సింహ దృష్టికి స్థానిక నాయకులు ఈ సమస్యలను తీసుకెళ్లి, ఆ పనులు పూర్తిచేస్తారా.. లేదా? అని నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

డాక్టర్లు, సిబ్బంది కొరత

నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో రోజుకు దాదాపుగా 500 మంది వరకు ఔట్‌పేషెంట్లు వస్తుంటారు. ఆసుపత్రిలో 25 మంది వైద్యులు అవసరం కాగా, ప్రస్తుతం 12మంది మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు తూప్రాన్ ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లగా మరొకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో ప్రస్తుతం కేవలం 10 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పైగా పదిమందిలో ఇద్దరు మాత్రమే ఎంబీబీఎస్ డాక్టర్లు ఉన్నారు. ఔట్‌పేషెంట్లను చూడటానికి డ్యూటీ డాక్టర్లు లేకుండా పోవడంతో ఉన్న ఇద్దరితో పాటు స్పెషలిస్టు డాక్టర్లు కూడా డ్యూటీ డాక్టర్ల విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రాత్రి పూట డ్యూటీ డాక్టర్ల కొరత తీవ్రంగా ఉండటంతో ఎమర్జెన్సీ కేసులు వస్తే వారిని సంగారెడ్డి, హైదరాబాద్‌కు తరలించాల్సి వస్తుంది. ఇక స్పెషలిస్టులలో కూడా గైనకాలజిస్టులు మొత్తం 5 మందికి గానూ ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో నర్సాపూర్ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించడం ఇబ్బందిగా మారింది. ఈ ఆసుపత్రికి నియోజకవర్గ పరిధిలోని పేషెంట్లు వందల సంఖ్యలో వస్తుంటారు. ఇక ఆర్థోపెడిక్ డాక్టర్ తూప్రాన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎవరూ రాలేదు. దీంతో పాటు స్కిన్ స్పెషలిస్టు, రేడియాలజిస్టు, ఐ స్పెషలిస్టును నియమించాల్సి ఉంది. వైద్యుల కొరత వల్ల ఉన్న వారే ఔట్ పేషంట్లతో పాటు ఇతర సేవలు, పోస్టుమార్టం, ప్రమాదాలతో వచ్చే క్షతగాత్రులను చూడటం వంటి పనులతో పనిభారం పెరిగి ఇబ్బందులు తప్పడం లేదు. నర్సాపూర్ ఆసుపత్రిలో సిబ్బంది కొరత రోగుల పాలిట శాపంగా మారింది. 30 మంది వరకు నర్సులు అవసరం కాగా, కేవలం 20మంది మాత్రమే ఉన్నారు. అందులో కూడా ఏడుగురు మెదక్ ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లారు.

అధునాతన పరికరాలదీ అదే పరిస్థితి

అధునాతన పరికరాలు కూడా పూర్తిస్థాయిలో లేవు. సీటీ స్కానింగ్ లేకపోగా అల్ట్రాసౌండ్ పరికరం ఉన్నా పూర్తి స్థాయి రేడియాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్ కోసం బయటకు వెళ్లాల్సిందే. ఇక డిజిటల్ ఎక్స్‌రే ఉన్నా తరచూ చెడిపోతుంది. ఆర్థోపెడిక్, డెంటల్ సంబంధించిన అధునాతన పరికరాలు అసలే లేవు. ఇక రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు చేసినా నిరుపయోగంగానే ఉంది. రూ. 50లక్షలతో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేసినా ఇప్పటికీ వినియోగించడం లేదు. దీంతో బయట నుంచి కొనుగోలు చేసుకుని రావాల్సివస్తోంది. అదేవిధంగా మార్చురీలో ఒకేసారి 6 మృతదేహాలను భద్రపరచడానికి ఏసీ బాక్సులు ఆసుపత్రికి వచ్చినా వాటి వినియోగానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడంతో అవి కూడా నిరుపయోగంగా ఉన్నాయి.

కార్పొరేషన్‌తో నిరుపేద ఆర్యవైశ్యులకు సహకారం



ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కాల్వ సుజాత

సంగారెడ్డి టౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిరుపేద వైశ్యులకు సహకారం అందిస్తామని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత పేర్కొన్నారు. సంగారెడ్డిలోని వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10ఏళ్లపాటు పోరాటం చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇవ్వకున్నా మొదటిసారిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. 8వ తేదీన తాను కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించే ర్యాలీకి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో హాజరై సత్తా చాటితే కార్పొరేషన్‌కు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. అనంతరం టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు తాను ఎప్పటికీ అండగా ఉంటానన్నారు. అంతకు ముందు ఆర్యవైశ్య నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా కొంపల్లి విద్యాసాగర్, వర్కింగ్ అధ్యక్షుడిగా మాదంశెట్టి పూర్ణచందర్, కార్యదర్శిగా నామ భాస్కర్, కోశాధికారిగా ఆమెటి భాస్కర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్, రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు జూలకంటి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మణిగాల మాణిక్ ప్రభు, కోశాధికారి బొమ్మ చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

తూప్రాన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు మహాసభలో తీర్మానం చేశారు. తూప్రాన్ పట్టణంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌లో రెండు జిల్లాల 15వ మహాసభలను నిర్వహించి ఆదివారం ముగించారు. జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో రెండో రోజు ఆదివారం పలు తీర్మానాలు చేశారు. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, కనీస వేతనాల జీవోలను అమలు చేయాలని, ఈఐఎస్ఐ, పీఎఫ్, బోనస్ సౌకర్యాలు కల్పించాలని తీర్మానించారు. మహాసభలో రాష్ట్ర కార్యదర్శి చుక్క రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయలక్ష్మి పాల్గొన్నారు.



తూప్రాన్ సీపీఎం మహాసభలో ప్రసంగిస్తున్న చుక్క రాములు

సీపీఎం జిల్లా కమిటీ ఎన్నిక

మెదక్ జిల్లా సీపీఎం జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి చుక్కా రాములు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.జయలక్ష్మి పరిశీలకులు ఎన్నుకున్నారు. మెదక్ జిల్లా కార్యదర్శిగా నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యులుగా ఏ. మల్లేశం, బి. బస్వరాజు, కే. మల్లేశం, ఏ. మహేందర్‌రెడ్డి, బి. బాలమణి, కార్యవర్గ సభ్యులుగా కె.నాగరాజు, కె.భాగయ్య, జె.సంతోష్, కె.ప్రవీణ్, డి.మల్లేశం, సీహెచ్. అజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఘనంగా విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

మెదక్ అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందించాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంతోపాటు డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్‌శాఖ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సేవల కోసం వచ్చే వినియోగదారులతో మర్యాద పూర్వకంగా మెలగాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆపరేషన్ డివిజనల్ ఇంజనీర్ షేక్ చంద్ షరీఫ్ బాషా, ఏడీఏ మోహన్‌బాబు, కౌన్సిలర్లు అంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల అర్జీలను స్వీకరిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్

దిగుబడి లేక దిగాలు...

(5వ పేజీ తరువాయి)

తెలుస్తున్నది. ఆ రెండుచోట్ల కూడా ఇంకా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. 10వ తేదీ తరువాతనే కొనుగోలు కేంద్రాలు తెరుచుకుంటాయని తెలుస్తున్నది. దీంతో, కొందరు రైతులు పత్తిని ఇళ్లల్లో నిల్వచేసుకోగా.. ఆర్థిక అవసరాలు ఉన్నవారు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

దళారుల ఇష్టారాజ్యం

రెండు వారాలుగా పత్తితీత కొనసాగుతునప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు విక్రయించాల్సిందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. 12 శాతం తేమ ఉన్న క్వింటాలు పత్తికి ప్రభుత్వం రూ.7,520 మద్దతుధర నిర్ణయించింది. కానీ, గ్రామాల్లో పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మాత్రం రైతులకు క్వింటాలుకు రూ.6,500 మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పత్తి సాగుకు ఎకరాకు రూ. 35వేల వరకు ఖర్చు అయ్యిందని, ఈసారి పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి వస్తాయోలేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే పత్తిని కొనుగోలు చేయాలని, క్వింటాలుకు రూ. 10వేలు మద్దతు ధర చెల్లించాలని వారు కోరుతున్నారు.

పెట్టుబడి రావడం కష్టమే

- ఆనంద్, పత్తి రైతు కోహీర్

పెట్టుబడి కోసం అప్పులు తీసుకొచ్చి అనేక రకాలుగా ఇబ్బందులు పడి పత్తి పంటను సాగుచేస్తే మద్దతుధర లేక పెట్టుబడి తిరిగిరావడం కూడా కష్టంగా కనిపిస్తున్నది. పెరిగిన ఖర్చులు, తగ్గిన దిగుబడిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మద్దతుధరను సవరించాలి.

తేమ ఎక్కువుంటే మద్దతు ధర వర్తించదు

-వరుణ్ రఘువీర్, సీసీఐ కమర్షియల్ ఆఫీసర్

సీసీఐ కేంద్రాలకు తీసుకువచ్చిన పత్తిలో తేమ 12 శాతం లోపు ఉండాలి. పత్తిని ఆరబెట్టిన తర్వాతనే రైతులు కొనుగోల కేంద్రాలకు తీసుకరావాలి. తేమ శాతం ఎక్కువ వస్తే మద్దతు ధర వర్తించదు. తేమ శాతం పరీక్షించేందుకు యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశాం. ఈ నెల రెండో వారంలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

కేంద్రాల్లోనే విక్రయించాలి

-సుధాకర్ రెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలి. కేంద్రాల వద్ద తేమశాతం పరిశీలించేందుకు పరికరాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేస్తున్నాం. పత్తి కొనుగోలుపై రాయికోడ్ మార్కెట్‌లో సోమవారం సమావేశం నిర్వహిస్తున్నాం.

విజ్ఞానంతోనే మూఢనమ్మకాల నిర్మూలన

చిలప్‌చెడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని ఎస్ఐ యాదగిరి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయకమిటీ సభ్యుడు నరేష్ పేర్కొన్నారు. ఆదివారం చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మిస్బావుద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

- గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొండాపూర్,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్ముకొని మోసపోవద్దని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కొండాపూర్, గొల్లపల్లి పీఏసీఎస్‌లలో వరిధ్యానం కొనుగోలు కేంద్రాలకు టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం గొల్లపల్లి పీఏసీఎస్ గోదాం ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, పాల్గొన్నారు.

- శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చూడాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దంతాన్‌పల్లి, కొంతాన్‌పల్లి, పోతులబోగుడ, ఉసిరికపల్లి, పిల్లుట్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ ఎంపీపీ హరికృష్ణ, నాయకులు తదితరులు అన్నారు.

- పుల్‌కల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలం గొంగ్లూరు గ్రామంలో శివంపేట పీఏసీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ పల్లె సరోజసంజీవయ్య ప్రారంభించారు. శివంపేట సొసైటీ కార్యాలయంతో పాటు గొంగ్లూరులో ప్రతీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో డీసీఎంఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్ ప్రారంభించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.



కొండాపూర్: గొల్లపల్లి పీఏసీఎస్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

- సంగారెడ్డి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం అధికారులను ఆదేశించారు. మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సందర్శించి పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు.



శివ్వంపేట: కొంతాన్‌పల్లి లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

- హత్నూర, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చూడాలని డీఆర్డీవో జ్యోతి పేర్కొన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు చేరేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట డీపీఎం జయశ్రీ, ఏపీఎం దేవేందర్, సీసీలు ఉన్నారు.

- జిన్నారం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సమస్యలు రాకుండా సేకరణ చేపట్టాలని మండల తహసీల్దార్ భిక్షపతి పేర్కొన్నారు. ఆదివారం జిన్నారం, వావిలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దా పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పలువురు రైతుల స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీ

శివ్వంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల దగ్గర నుంచి పలు బోరు మోటార్ల కేబుల్ వైర్లు, స్టార్టర్లు, ఫ్యూజ్‌లను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఈ సంఘటన మండలంలోని బోజ్యా తండాలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని భోజ్యా తండాలో శనివారం రాత్రి బానోత్ మంజ్యా రాజు, బన్సీలాల్, రమేష్, కర్రె రాములు, నర్సయ్య, రూప్లా, రమేష్‌తో పాటు పలువురు రైతులకు చెందిన కేబుల్ వైర్లు, ఫ్యూజ్ వైర్లు, స్టార్టర్లను అపహరించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత.. పది మందిపై కేసు

తూప్రాన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లి శివారులోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలను ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. బ్రాహ్మణపల్లి శివారులోని ప్రభుత్వ భూమి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్నట్లు వివరించారు. మట్టి రవాణా చేస్తున్న ఐదు టిప్పర్లు, హిటాచీ సీజ్ చేసి, 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

15న అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

- సంగారెడ్డి డీఎం ఉపేందర్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని అరుణాచల గిరిప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల కోసం పౌర్ణమి సందర్భంగా ఈ నెల 15 న ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడపాలని టీజీఆర్టీసీ నిర్ణయించినట్టు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. 13న రాత్రి 6 గంటలకు సంగారెడ్డిలోని పాత బస్టాండ్ నుంచి బయలుదేరుతుందన్నారు. కాణిపాకంలోని విఘ్నేశ్వర దర్శనం వేలూరులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం 14న రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. గిరిప్రదక్షిణ పూర్తయిన తర్వాత 15న సాయంత్రం 5 గంటలకు బయలుదేరి 16న జోగులాంబ అమ్మవారి శక్తి పీఠం సన్నిధికి వెళ్తుందన్నారు. అక్కడ దర్శనం అనంతరం సంగారెడ్డికి అదే రోజు సాయంత్రం 7 గంటల వరకు చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.4,300 టిక్కెట్ ధర నిర్ణయించిందని, టూర్ ప్యాకేజీ కోసం సంస్థ అధికార వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 9959226267, 73828231275 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపుపై సంబరాలు



ఎస్సీ హాస్టల్‌లో సీఎంకు ప్లకార్డులతో ధన్యవాదాలు తెలుపుతున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు పట్ల పలు హాస్టల్ విద్యార్థులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. సంగారెడ్డి తారా కళాశాల ప్రాంగణంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలు ప్రదర్శిస్తూ ధన్యవాదాలు తెలిపారు. పట్టణ సమీపంలోని సమీకృత హాస్టల్ సముదాయంలో విద్యార్థులు మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు నాగేశ్వరారావు, మల్లికార్జున్, రమేశ్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి.శంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దు: ఎస్ఐ



క్రాంతికుమార్, పుల్కల్ ఎస్ఐ

పుల్‌కల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై వరి ధాన్యంతో పాటు ఇతర పంట నూర్పిళ్లు చేయవద్దని పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి పుల్కల్ మండలంలో రైతులు రోడ్లపై వరి ధాన్యం కుప్పలు ఉంచడం వల్ల రాత్రి వేళలో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారి, ఇతర సర్వీసు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ధాన్యాన్ని కుప్పలుగా పోయడం సరికాదన్నారు. ఇటీవల తూప్రాన్ సమీపంలో వడ్ల కుప్పల కారణంగా ప్రమాదం జరిగి నలుగురు మృత్యువాతకు గురయ్యారని గుర్తు చేశారు. రైతులు ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబెట్టుకోవాలని ఎస్ఐ సూచించారు. రోడ్లపై ఆరబెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గంజాయి బారి నుంచి యువతను కాపాడాలి



జలగరి దేవకుమార్

పటాన్‌చెరు రూరల్, నవంబరు 3 : గంజాయి బారి నుంచి యువతను కాపాడడానికి ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రముఖ నాయకుడు, సామాజికవాది జలగరి దేవకుమార్ ముదిరాజ్ కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాల విధానాల ఫలితంగా తెలుగు రాష్ట్రాలలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగి యువతను గంజాయికి బానిసలుగా మార్చిందన్నారు. రేవంత్ ప్రభుత్వం గంజాయి విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపినప్పటికీ కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు గంజాయి అమ్మకాలు చాక్లెట్ల రూపంలో విక్రయించి పిల్లలను కూడా మత్తుకు అలవాటు పడేలా కుట్రలు పన్నడం ఇటీవల వెలుగులోకి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాల్లో హనుమాన్‌చాలీసా పారాయణం

పుల్‌కల్/వట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం గ్రామంలో స్థానిక హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం సామూహిక హనుమాన్ చాలీసా 25వ వారం పారాయణాన్ని బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి ముఖ్యఅతిథిగా హాజరై భక్తులు, యువత, మహిళలకు అనుగ్రహ భాషణం చేశారు. అదేవిధంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వట్‌పల్లిలోని హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.



ఉప్పరిగూడెంలో హనుమాన్ చాలీసా పారాయణం చేయిస్తున్న మహేశ్వరశర్మ సిద్ధాంతి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తూప్రాన్‌లో హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తూప్రాన్/అల్లాదుర్గం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 1985-86బ్యాచ్ పూర్వవిద్యార్థులు, అదేవిధంగా అల్లాదుర్గం లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 1992-93 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం వేర్వేరుగా ఆత్మీయ సమావేశాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు పరస్పరం యోగక్షేమాలను తెలుసుకుంటూ, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా సందడి చేశారు. తమకు విద్య నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు.



అల్లాదుర్గం: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు